

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: బాల కార్మిక నిర్మూలన, పునరావాసంలో భాగంగా పాడేరులో పలు దుకాణలు, సంస్థలపై శుక్రవారం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ తనిఖీలు నిర్వహించింది. తనిఖీలలో భాగంగా జిల్లా కార్మిక శాఖ ఇంచార్జి ఆఫీసర్ టి సుజాత, సహాయ కార్మిక శాఖ అధికారి పి. సూర్యనారాయణ, ఐసిడిఎస్ సోషల్ వెల్ఫేర్, పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులు సంయుక్తంగా ఆయా యాజమాన్యం, పిల్లలకు అవగాహన కల్పించారు. అదేవిదంగా బాలకార్మికులను పనిలో పెట్టుకొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సుజాత

ఉమ్మడి విశాఖకు నిరాశే..



- మెట్రో రైలు ఊసే లేదు
- విశాఖ పై ఓవర్లపై కన్నెత్తి చూడలేదు
- స్టార్టప్‌లకు అరకొర కేటాయింపులే
- మత్స్యకార భరోసా పెంచినా నిబంధనల దడ
- సాగునీటి ప్రాజెక్టులకు నామమాత్రపు కేటాయింపులు
- ఏజెన్సీకి సాయం కరువు
- రాష్ట్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/అనకాపల్లి ప్రతినిధి

శుక్రవారం ఉదయం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ - 2025 ఉమ్మడి విశాఖను తీవ్ర నిరాశ పరిచింది. తాజా బడ్జెట్‌లో విశాఖకు సంబంధించి మెట్రో రైలు, ఫ్లైఓవర్లు, ఐటి సెక్టార్ వంటివాటికి, అనకాపల్లి జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులకు, అల్లూరి జిల్లాలో గిరిజనుల సంక్షేమానికి ఏమాత్రమూ చర్యలు కానరాలేదు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అద్భుత బడ్జెట్ అంటూ దీన్ని పేర్కొనగా పలువురు ఈ బడ్జెట్‌పై పెదవి విరుస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్‌గా దీన్ని పేర్కొంటున్నారు.

విశాఖ జిల్లాకు అశనిపాతంలా ఈ బడ్జెట్ మారింది. అన్ని పథకాలనూ కలగలిపేసి అరకొర సంక్షేమంతో నెట్టుకు రావాలన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం అడుగులేయడం స్పష్టంగా కనిపించింది. ఐటి రంగానికి రాష్ట్రంలో రూ.300 కోట్లు కేటాయించినప్పటికీ ఎంత విడుదలౌతుందో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. అలాగే రాష్ట్రంలోని స్టార్టప్ కంపెనీల నుంచి రూ.100 కోట్లు డిమాండ్ ఉండగా కేవలం రూ.60 కోట్లతో సరిపెట్టుకోవాలని బడ్జెట్‌లో ప్రతిపాదించడంతో కొత్తగా ఏర్పాటు చేయబోయే ఐటి స్టార్టప్ ఎంటర్‌ప్రూనర్స్‌ను నిరాశ పరిచినట్టయింది. ఇవి కేటాయింపులే అయినందున ఆచరణలో మంజూరు, విడుదల మాటేమిటో అంటూ ఆ రంగానికి చెందినవారు పెదవి విరుస్తున్నారు.

విశాఖకు అత్యంత కీలకమైన ఫ్లై ఓవర్ బ్రిడ్జల నిర్మాణం, మెట్రో రైలు ప్రతిపాదనలపై కదలిక ఈ బడ్జెట్‌లో ఎక్కడా కానరాలేదు. ఇవి కేంద్రం, జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీతో అనుసంధానమైన ప్రాజెక్టులే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వీటికి ఏ మేరకు ప్రాధాన్యం ఇవ్వనుందో ఈ బడ్జెట్‌లో లేకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

మత్స్యకార భరోసా పెంచినా.. ఎక్కడో ఆందోళన

గత ప్రభుత్వంలో మత్స్యకారుల వేట నిషేధ సమయంలో ప్రభుత్వం రూ.10 వేలను కుటుంబానికి సాయంగా అందజేసేది. తాజా బడ్జెట్‌లో కూటమి సర్కారు దీన్ని రూ.20 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంత వరకూ బాగున్నా నిబంధనల పేరిట కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్న ఆందోళన పలువురిలో ఉంది. ప్రస్తుతం ఈ భరోసా పథకం ద్వారా 14 వేల మంది మత్స్యకారులు లబ్ధిపొందుతున్నారు. రాష్ట్రంలోని పోలీస్ కమిషనరేట్ల పరిధిలో స్టేషన్లకు రూ.300 కోట్లును రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించారు. అయితే, వీటిలో జీతభత్యాలకే రూ.290 కోట్లు అలవెన్సులు ఇవ్వాల్సి ఉండడంతో ఇది పెద్దగా పెరుగుదల కాదంటూ పోలీస్ శాఖకు చెందిన సిబ్బంది వాపోతున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ల్యాండ్ ట్యాక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏటా వసూలు చేస్తోంది. దీన్ని మినహాయించాలన్న డిమాండ్ కార్మిక సంఘాలు చేస్తున్నా అమలు కావడం లేదు. ప్రైవేట్ అదానీ గంగవరం పోర్టుకు నాలా, ల్యాండ్ ట్యాక్స్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని, విశాఖ స్టీల్‌కు అలాంటి మినహాయింపు ఇస్తే ఆర్థిక భారం తగ్గుతుందన్న డిమాండ్ కార్మికుల వైపు నుంచి ఉంది. దీన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు.

సాగునీటి అవసరాలు తీర్చని ప్రభుత్వం

కూటమి ప్రభుత్వ బడ్జెట్ అనకాపల్లి జిల్లా ప్రజల ఆశలను తీర్చేలా లేదు. ప్రధానంగా సాగునీటి వనరులకు కేటాయింపులు ప్రాజెక్టులు పూర్తయ్యేలాలేవు. 17 వేల కోట్ల విలువైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.605.75 కోట్లునే కేటాయించారు. గతేడాది కంటే కేటాయింపులు పెంచినప్పటికీ ప్రాజెక్ట అవసరాలకు తగినట్లు కేటాయించలేదు. జిల్లాలో పెద్దగాలేని సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలన్న సంకల్పం ప్రభుత్వంలో కనిపించడంలేదు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు బడ్జెట్ కేటాయింపులున్నాయి. సుజల స్రవంతికి 2023-24 వైసిపి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించి నిధులు విడుదల చేయలేదు. 2024-25 బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం చేసిన రూ.63.21 కోట్ల కేటాయింపు కాగితాలకు పరిమితమైంది. 2025-26 బడ్జెట్‌లో చేసిన రూ.605.75 కోట్లులో భూ సేకరణకైనా నిధులు విడుదల చేస్తారా ? కేటాయింపులకే పరిమితమవుతారా ? అనేది వేచిచూడాలి. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియోజకవర్గ పరిధిలోని తాండవ జలాశయానికి గతేడాది కంటే బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. తాండవ గేట్, ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటర్ల మరమ్మతులకు గత బడ్జెట్‌లో రూ.7.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.48.30 లక్షలు కేటాయించింది. పెద్దేరు జలాశయానికి గతేడాది పది వేలు కేటాయించగా, ఈసారి రెండు కోట్లు కేటాయించింది.

రైవాడ, కోనాం జలాశయాలకు కేటాయింపులు పెరిగాయి. రైవాడకు రూ.75 లక్షలు, కోనాంకు రూ.10.01 లక్షలు కేటాయించింది. ఈ జలాశయాల ఆధునికీకరణతో పాటు ప్రధాన కాలువల మరమ్మతులు చేపట్టాల్సివుంది. గతసారి కంటే కేటాయింపులు పెరిగినా జలాశయాల ఆయకట్టు స్థిరీకరణకు, మరమ్మతు పనులు పూర్తిగా చేయడానికి కేటాయించిన నిధులు సంపూర్ణంగా విడుదల చేసినా సరిపోవు.



ఆదివాసీలకు అన్యాయం

కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఆదివాసీల సంక్షేమానికి రూ.8159 కోట్లు కేటాయించినట్టు గొప్పలు పోతున్నా అవి గిరిజన ప్రాంతానికీ ఏమూలకూ సరిపోవు. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల, జిఓ నెంబర్ 3కి చట్టబద్ధత వంటి అంశాలపై బడ్జెట్ ప్రసంగంలో కనీస ప్రస్తావన లేకపోవడం అందరినీ బాధించింది. ఆదివాసీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు 6.59 శాతం జరగాల్సి ఉండగా ఆ తీరుగా కేటాయింపులు లేవు. దీంతో ఆదివాసీలంతా ఆగ్రహంతో ఉన్నారు. ఎస్‌టి సబ్ ప్లాన్, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపైనా బడ్జెట్‌లో ప్రస్తావన కరువైంది. ఏజెన్సీలో అక్షరాస్యత శాతం పెంచేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు సరైన కేటాయింపులు లేకుండా పోయాయి.

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ : సిపిఎం



ప్రజాశక్తి -పాడేరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్, రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనరస విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయం, ఇరిగేషన్, సంక్షేమ కార్యక్రమాలకు గత బడ్జెట్ కన్నా పెరుగుదల పెద్దగా లేదని, పైగా తల్లికి వందనం కేటాయింపులు తగ్గాయని తెలిపారు. టిడిపి కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా యువతకు నిరుద్యోగ భృతి గురించి మాట మాత్రం ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. . అప్కాస్ రద్దు చేసి తిరిగి పాత కాంట్రాక్టు పద్ధతిపునరుద్ధరించడం ఉద్యోగులు, కార్మికుల్ని అభద్రతకు గురిచేస్తుందన్నారు. గత ఏడాది ఆందోళన చేసిన అంగన్వాడీ, ఆశా, మున్సిపల్వర్కర్లకు ప్రతిపక్షంలో ఉండగా న్యాయం చేస్తామని చెప్పి, ఇప్పుడు అధికారానికి వచ్చిన కూటమి తాజా బడ్జెట్లో వారికి మొండిచెయ్యిచూపించిందన్నారు. గత ప్రభుత్వం కన్నా ఎక్కువగా అప్పుల ఊబి, భారాల మోత తప్పని స్థితిని ప్రభుత్వం తీసుకొస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి భారాలు పడకుండా ఎదుర్కోవాల్సి ఉందని చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్



ప్రజాశక్తి-పాడేరు: మార్చి ఒకటవ తేదీ శనివారం నుండి ఇంటర్మీడియట్ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా మధ్య, అత్యంత పకడ్బందీగా, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. శుక్రవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసామని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలలో సిసి కేమెరాల నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్ష్ కేంద్రాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలలోనికి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది ఎవ్వరూ ఎలక్ట్రానిక్ పరికరాలను, మొబైల్ ఫోన్లను తీసుకు వెళ్లరాదని సూచించారు. ఎవరైనా మొబైల్‌తో లోనికి వెళ్తే విధులలో ఉన్న పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం మాస్ కాపీయింగ్, పేపర్ లీకజిల పట్ల కఠినంగా ఉందన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను, ప్రతి కేంద్రానికి ఒక నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. సిసి కెమెరాల ద్వారా జిల్లా ప్రధాన కేంద్రం నుండి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

జేసి ఎం.జే అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ, ఇప్పటికే పరీక్ష పత్రాలు ఆయా పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయన్నారు. ప్రతి కేంద్రంలో కనీస మౌలిక వసతులైన తాగు నీరు, విద్యుత్ సౌకర్యం చెక్ చేసుకోవాలని తహసిల్దార్లను ఆదేశించారు. అదేవిధంగా ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ ను ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి సమాచార సేకరణకు ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలకు, హాల్ టికట్లకు సంబంధించిన సమాచారాన్ని 7382638698 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని జేసి సూచించారు

మార్చి ఒకటవ తేదీ నుండి జరుగనున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 6,518 మంది, ఒకేషనల్ పరీక్షలకు 1,545 మంది, రెండవ సంవత్సరం పరీక్షలకు 5,335 మంది, ఒకేషనల్ పరీక్షలకు 1,322 హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, అందుకు జిల్లా వ్యాప్తంగా 26 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. పాడేరు డివిజన్ లో పది కేంద్రాలు, చింతూరు, రంపచోడవరం డివిజన్లలో 16 కేంద్రాలు ఏర్పాటు చేసామని, ఇందులో రాజ ఒమ్మంగి, అడ్డతీగల, వి.ఆర్. పురం కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. సార్వత్రిక విద్యా విధానంలో (ఓపెన్ స్కూల్) 1,699 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కానున్నారని, వీరికి మాత్రం మార్చ్ మూడవ తేదీ నుండి 15వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, అందుకు గాను ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో సబ్ కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కేఆర్ కల్పశ్రి, ఎఎస్పీలు, డిఎస్పీలు, డిఇఓ పి. బ్రహ్మాజీరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. అప్పల రాము, సహాయ కమిషనర్ (పరీక్షలు) శశి కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డిడిలు ఎల్ రజని, శాంత కుమారి, తహసిల్దార్లు పాల్గొన్నారు.


చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ కుమార్

సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి-సీలేరు : చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని డిఎల్‌పిఓ కుమార్ పంచాయతీ కార్యదర్శి పరుశురాంను ఆదేశించారు. జీకే వీధి మండలంలో శుక్రవారం పర్యటించిన డిఎల్‌పిఓ సీలేరు మేజరు పంచాయతీకి చేరుకొని కార్యదర్శి పరశురాం, సర్పంచ్ దుర్గో, గుమస్తా ప్రకాష్‌తో సమావేశమయ్యారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పంచాయతీ పరిధిలో పన్నులు, ఏపీ జెన్కో హౌస్ టాక్స్ ఏ మేరకు వసూలు చేశారని అడిగి తెలుసుకున్నారు. మార్చిలోపే హౌస్ టాక్స్‌లు అన్ని పూర్తిగా వసూలు చేసి పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. పంచాయతీ నిధులు ఏ మేరకు ఉనాయి, ఎంత ఖర్చయింది, ఏయే అభివృద్ధి పనులు చేపట్టారని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పంచాయతీ నిబంధనల ప్రకారం వార్డు సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నారా? లేదా? వార్డు సభ్యులు హాజరవుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ సభ్యులు సమావేశానికి హాజరు కాకపోతే నోటీసును వారి ఇంటికి అతికించి ఒక నోటీసును రికార్డులో పొందుపరచాలని సూచించారు. సచివాలయ సిబ్బంది విధులకు హాజరవుతున్నారా లేదా? విధి నిర్వహణ సక్రమంగా చేపడుతున్నారా అని కార్యదర్శి పరశురాంను అడిగి తెలుసుకున్నారు. మరోసారి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి వార్డు సభ్యులతో సమావేశమై వారికున్న సమస్యలను అడిగి తెలుసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఇఒపిఆర్‌డి పాపారావు, సీలేరు ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఉపసర్పంచ్ కె.వల్లి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

కొయ్యూరు : చెత్త నుండి సంవద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యుపిసి) షెడ్లు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కొయ్యూరు ఎంపీడీవో ఎస్‌కెవి.ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని ముంప, రేవళ్ల గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్ల నిర్మాణాల అంచనా విలువలను త్వరగా తయారు చేసి తమకు అందజేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ షెడ్లు వారం రోజుల వ్యవధిలో పనిచేసే స్థాయికి తీసుకురావాలని వంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్ తదితరులు

కుని ఆపరేషన్ల కోసం బాలింతల పడిగాపులు

- పిహెచ్‌సి నుండి సరైన సమాచారం ఇవ్వని వైనం
- పట్టించుకోని ఏరియా ఆసుపత్రి అధికారులు
- సిపిఎం ఆధ్వర్యాన బాధితుల నిరసన



ఏరియా ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత బాలింతలు, సిపిఎం నేత వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి శుక్రవారం వచ్చిన బాలింతలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఆశా వర్కర్లకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఆసుపత్రికి వచ్చిన బాలింతలను ఏరియా ఆసుపత్రి అధికారులు పట్టించుకోకపోవడంతో సిపిఎం ఆధ్వర్యాన బాధితులు ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. మారేడుమిల్లి మండలానికి చెందిన 13 మంది బాలింతలు పసి పిల్లలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద వచ్చారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఆహారంగాని, తాగడానికి మంచినీళ్లుగాని లేకుండా బాలింతలు పసిపిల్లలతో పడిగాపులు కాచారు. అయినా ఏరియా ఆసుపత్రి అధికారులు కనీసం పట్టించుకోలేదు. దీంతో సిపిఎం నేతలకు సమాచారం రావడంతో ఆ పార్టీ ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ ఆసుపత్రికి చేరుకొని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు.

దీనికి స్పందించిన సూపరింటెండెంట్ రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ప్రతిరోజు 10 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పదిమంది బాలింతరాలను పంపించమని అడిషనల్ డిఎంహెచ్ఒ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లకు తెలియజేశారన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సుమారు 8 మందికి ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. మరుసటి రోజు ఆపరేషన్‌కు వచ్చే పది మంది మధ్యాహ్నం సమయం దాటిన తర్వాత వచ్చి ఏరియా ఆసుపత్రిలో అడ్మిట్ కావాల్సి ఉంటుందని చెప్పారు. అయితే మారేడుమిల్లు నుండి 13 మంది ఏరియా ఆసుపత్రికి వస్తున్నట్టు ముందుగా మారేడుమిల్లి పిహెచ్‌సి నుండి తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, అందువల్లే వారిని అడ్మిట్ చేసుకోలేదని తెలిపారు.

సంబంధిత ఆశా వర్కర్లు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం లోపు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి బారింతరాలను తీసుకొని వెళ్ళమని ఏఎన్ఎంలు తమకు చెప్పారని, అంతే అంతే తప్పా ఫలానా సమయంలో తీసుకుని వెళ్లాలని చెప్పలేదని తెలిపారు. అందువల్లే ఉదయం 9 గంటలకే ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చామని చెప్పారు. ఓపి రాయించుకొని వైద్యులను కలిసి వైద్య పరీక్షలు రాయాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ ఏరియా ఆసుపత్రికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమస్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. 13 మంది బాలింతలను ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని వారికి అవసరమైన భోజన సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు.

నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని వివిధ శాఖల ఇంజనీరింగ్ విభాగాల ద్వారా ప్రారంభించిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో శుక్రవారం ఐటిడిఎ పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షం కాలానికి ముందుగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, పీఎంయు, గహ నిర్మాణం తదితర శాఖల ఇంజనీరింగ్ విభాగం ద్వారా ప్రారంభించిన పనులు ఏ దశలో ఉన్నాయో ఆరా తీశారు. పనులు పూర్తి చేసిన వెంటనే సంబంధిత ఇంజనీర్లకు ఎం బుక్కుల ద్వారా బిల్లులు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలు ముందుగా పూర్తి చేయాలన్నారు. గోకులం షెడ్లు పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. భవనాలు నిర్మాణం కొరకు ఇసుక సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కాంట్రాక్టర్లను పిఒ కోరారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, చైతన్య, నాగరాజు, గౌతమి, శివ, అస్టెంట్ ఇంజనీర్లు సత్యనారాయణ, భాను, ఏఈలు, జేఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం


కృష్ణ ప్రసాద్‌ను విచారిస్తున్న డిఎల్‌పిఒ నర్సింగరావు తదితరులు

జిఎం.వలస పంచాయతీ కార్యదర్శిపై విచారణ

- శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధుల డిమాండ్
- నివేదికను డిపిఒకు సమర్పిస్తామని డిఎల్‌పిఒ నర్సింగరావు వెల్లడి

ప్రజాశక్తి మారేడుమిల్లి

మండలంలోని జిఎం.వలస పంచాయతీ కార్యదర్శి వనిమిశెట్టి కృష్ణప్రసాదుపై వచ్చిన ఫిర్యాదులపై జిల్లా పంచాయతీ అధికారి బి.లోవరాజు ఆదేశాలు మేరకు రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి కె.నరసింగరావు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం బహిరంగ విచారణ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు విచారణకు వచ్చిన జియం వలస సర్పంచ్ కారం లక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసన్న విశ్వనాథ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలిపారు. జియం వలస పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న నాటినుంచి కృష్ణ ప్రసాద్ ప్రవర్తన వివాదాస్పదంగా ఉందని, దీనివలన ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని టిడిపి మండల అధ్యక్షులు శేషుకుమార్ విచారణ అధికారికి ఫిర్యాదు చేశారు. కార్యదర్శి గ్రామంలో అందుబాటులో ఉండకపోవడం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ తమను అవమానిస్తున్నారని సర్పంచ్ కారం లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ పనులపై గ్రామ సచివాలయానికి వస్తున్న గిరిజనులను చులకన చేస్తూ కించపర్చే విధంగా మాట్లాడుతున్నారని వాపోయారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు జరపడం లేదని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని మెరుగుపరచడంలో విఫలమయ్యారని, కార్యదర్శి నిర్లక్ష్యం వలన పంచాయతీ ప్రగతి కుంటుపడుతుందని తెలిపారు. ప్రభుత్వ సర్వేలు, స్టాట్యూటరీ గ్రామసభలు కూడా సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. పంచాయతీ అభివృద్ధికి సహకరించని కార్యదర్శి కృష్ణ ప్రసాదును తక్షణమే బదిలీ చేయాలని సర్పంచ్ లక్ష్మి విచారణ అధికారిని కోరారు. దీంతో ఎస్‌డబ్ల్యూపిసి నిర్వహణ ఎలాగుందని కార్యదర్శి కృష్ణ ప్రసాదును విచారణ అధికారి ప్రశ్నించగా సమాధానం చెప్పలేక నీళ్లు నమలడంతో డియల్‌పిఓ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి కృష్ణ ప్రసాద్.., తాను తప్పు చేశానని, తన పద్ధతి మార్చుకుంటానని, క్షమించి వదిలేయమని డిఎల్‌పిఓను కోరారు. అయితే విచారణ నివేదిక జిల్లా పంచాయతీ అధికారికి సమర్పిస్తానని డిఎల్‌పిఓ నరసింగరావు స్పష్టం చేశారు.

ఎంసి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కెవిఎస్.సంధ్యాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ డైరెక్టర్ నుంచి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు వచ్చాయి. తక్షణం ఈ నియామకం అమల్లోకి వస్తుందని, డాక్టర్ సంధ్యాదేవి పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డాక్టర్ సంధ్యాదేవి ఈ కళాశాలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లలో ఒకరు.

రేపు ఏకలవ్య మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-చింతపల్లి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని ఆరవ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 2న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని కొయ్యూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ డి సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2025-26 విద్యా సంవత్సరంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలలో 6వ తరగతిలో చేరేందుకు ఆంధ్రప్రదేశ్ గురుకులం ఉత్తర్వుల మేరకు మార్చి 2వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఆధార్ కార్డు తీసుకుని గంట ముందు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలన్నారు. హాల్ టికెట్ లో ఫోటో కనిపించకపోతే కలర్ పాస్ ఫోటో వెంట తీసుకురావాలని ఆయన సూచించారు.

పద్మపూజిత వీల్స్‌మార్ట్‌లో
నేటి నుంచి మెగా సేల్ మేళా


బసవరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : పద్మపూజిత వీల్స్ మార్ట్ సంస్థ ఆధ్వర్యంలో దొండపర్తిలోని సంస్థ కార్యాలయం వద్ద ఈనెల ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు మెగా సేల్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేత బసవరాజు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్మపూజిత వీల్స్ మార్ట్ సంస్థఆధ్వర్యంలో ఏటా మెగా సేల్ మేళా నిర్వహిస్తున్నామని, అలాగే ఈ ఏడాది కూడా సేల్ మేళాలో 400కు పైగా టూవీలర్స్, 50 పైగా కార్లు ప్రదర్శనలో ఉంచుతున్నట్లు తెలిపారు. అన్ని రకాల బ్రాండెడ్, విభిన్న మోడళ్లలో టూవీలర్స్ వెహికల్స్, కార్లు వినియోగదారులకు ప్రదర్శనలో ఉంచుతామని, ఈ అవకాశాన్ని విశాఖ ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. సేల్‌మేళాను జయప్రదం చేయాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆరిలోవ: నిరుపేద అంత్యక్రియలకు ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, సంఘ సేవకులు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు ఆర్థిక సాయం అందజేసారు. ఆరిలోవ నెహ్రూనగర్‌కు చెందిన పేద మహిళ కంటిపూడి సత్యవతి కేన్సరతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కంచర్ల అచ్చుతరావు, తన ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అంతిమ సంస్కారాలకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి నాగు మాట్లాడుతూ కష్టాలు, ఇబ్బందుల్లో ఉన్నవారికి ఉపకార్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు సాయం అందజేశారన్నారు. దాతలకు బాధిత కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.

ఎఐటియుసి నేత బాబూరావు మృతి

ప్రజాశక్తి - తగరపువలస : జివిఎంసి ఒకటోవార్డు చిట్టివలస, కొత్తపేటకు చెందిన చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి), సిపిఐ నేత అల్లు బాబూ రావు (78) శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బాబూరావు, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఆరోగ్యం విషమించి మృత్యువాత పడ్డారు. చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులుగా, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులుగా . చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యంతో పాటు పాలకుల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటాలు, ఉద్యమాలకు నేతృత్వం వహించి నిర్బంధాలను ఎదుర్కొన్నారు. బాబూరావుకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పలువురి సంతాపం

బాబూరావు మృతికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్య నారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, చిట్టివలస లేబర్ యూనియన్ అధ్యక్షులు పడాల రమణ, స్థానిక పార్టీ, యూనియన్ నాయకులు కానూరు రాంబాబు, ఎం అప్పలరాజు, సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్‌మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, కాకాస నాయకులు దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, టిఎన్‌టియుసి నాయకులు ఎంవి గురుమూర్తి తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముస్లిం మైనారిటీ కోటాలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ ముస్లిం మత పెద్దలు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. జుమా నమాజ్ అనంతరం జగదాంబ జంక్షన్ సమీప మక్కా మసీదు వద్ద ముస్లింలు భారీ సంఖ్యలో బ్యానర్లు, ఫ్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మక్కా మసీద్ కమిటీ అధ్యక్షులు ఎండి మునీర్ మాట్లాడుతూ విశాఖ జిల్లా జనాభాలో రెండో స్థానంలో ఉన్న ముస్లింలకు చట్టసభలలో సరైన ప్రాతినిధ్యాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కల్పించకపోవడం వల్ల ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు చిరాగ్ అలీ, సైపుద్దీన్ మాలిక్, సయ్యద్ గౌస్, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

సిఐఐ ఆధ్వర్యాన స్వర్ణాంధ్ర విజన్‌పై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఐఐ విశాఖపట్నం జోన్ వార్షిక సమావేశం శుక్రవారం ఉదయం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర విజన్ - 2029 విశాఖ రీజియన్ లీడింగ్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ రాష్ట్ర అభివద్ధి అజెండాలో విశాఖకు వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అంతరాలను తగ్గించడానికి తీసుకున్న చర్యలను వివరించారు. ప్రభుత్వం ఈ ఏడాది 15 నూతన రహదారుల్లో రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తోందన్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు రద్దీని తగ్గించే వ్యూహంతో సవరించిన మాస్టర్ ప్లాన్‌ను అభివృద్ధి చేస్తామని అన్నారు. నీతి ఆయోగ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ పార్థ సారథి రెడ్డి చేవూరు మాట్లాడుతూ పొడవైన తీరప్రాంతం, పటిష్టమైన ఓడరేవులు, హైవేలు, విమానాశ్రయాలు, రైలు నెట్‌వర్క్‌లు సహా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను ఆయన వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా సిఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ 2025-26 సంవత్సరానికి సిఐఐ విశాఖపట్నం జోన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. దక్కన్ ఫైన్ కెమికల్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డివిఎస్.నారాయణరాజు 2025-26 సంవత్సరానికి సిఐఐ విశాఖపట్నం జోన్ చైర్మన్‌గాను, ఇన్‌స్పైర్డ్ ఐటి సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ జి.కృష్ణమోహన్ వైస్ చైర్మన్‌గాను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎర్నెస్ట్ అండ్ యంగ్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అమిత్ మజుందార్, సిఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, సిఐఐ విశాఖపట్నం చైర్మన్ రాజేష్ గ్రంధి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా స్వయంభు భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం వద్ద జడ్డంగి పంచాయితీ రేవటిపాలెం గ్రామస్తులు ఏజెన్సీ విద్యాశాఖ అధికారి వై.మల్లేశ్వరరావు, కుటుంబ సభ్యులు సహకారంతో మూడవరోజు శుక్రవారం 2000 మందికి అన్న సమారాధన నిర్వహించారు. దీనికి ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు, మండలవాసులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, ఉపాధ్యాయులు డి పైడిమల్లు, బొజ్జియ్య, కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, ఆలయ కమిటీ సభ్యులు ఘనజాల తాతారావ్, సింగిరెడ్డి రామకృష్ణ, రవి, గంగాధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజంలో ఎంతో విలువైన వైద్య వృత్తిలో రోగులకు అందించిన సేవలే ఉద్యోగ విరమణ అనంతరం ఆయా వైద్యునికి మంచి పేరు, ప్రఖ్యాతలు తెచ్చిపెడతాయని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. శుక్రవారం ఆసుపత్రి ఎథిక్స్ గ్యాలరీలో సీనియర్ వైద్యులు, ఆర్ఎంఒ డాక్టర్ ధవళ భాస్కరరావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఆసుపత్రి పరిపాలనా విభాగం, వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివానంద మాట్లాడుతూ కెజిహెచ్ అభివృద్ధిలో డాక్టర్ ధవళ భాస్కరరావు అందించిన సేవలు మరువలేనివన్నారు. డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని పలు విభాగాల్లో కీలక బాధ్యతల్లో పనిచేసిన డాక్టర్ ధవళ భాస్కరరావు అంచెలంచెలుగా ఎదిగి నేడు ఉన్నత స్థానంలో ఉద్యోగ విరమణ చెందడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భాస్కరరావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ వాసవిలత, డాక్టర్ రాధాకృష్ణ, డిసిఎస్ఆర్ఎంఓ డాక్టర్ మెహర్, ఎఆర్ఎంఒ డాక్టర్ రాజేష్, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని పశువుల రైతులు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం గోడపత్రికను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. మార్చి ఒకటి నుండి మార్చి 30 వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు. గాలికుంటు వ్యాధితో పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుండి తీగల మాదిరి చొంగ, నోరు మరియు కాలి గిట్టల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకు పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. దీని కారణంగా పాల ఉత్పత్తి, పని సామర్థ్యం ఘనంగా తగ్గిపోవడం - రైతుకు ఆర్థిక నష్టం, పాలు త్రాగే దూడలలో మరణాలు, వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేయించడంతో పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వత నివారణ, మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా అరికట్టడం, దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగడానికి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పసుశుకు తప్పనిసరిగా టీకాను ఇప్పించాలన్నారు. బ్రూసెల్లోసిస్ వ్యాధితో పశువులకు జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, గర్భస్రావ మట్టు, మగ పశువులలో వృషణాల వాపులు, కీళ్ళవాపు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వ్యాధి సోకిన పశువుల నుండి మనుషులకు సోకుతుందన్నారు. బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ, నియంత్రణకు పశుసంవర్ధక శాఖ అన్ని పశువైద్యశాలలో లేదా పశుపోషకుని ఇంటి వద్దనే సంవత్సరానికి మూడు విడతలుగా ఉచితంగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయటం జరుగుతుందన్నారు. 4 - 8 నెలల వయస్సు గల పెయ్య దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. పాలను ఎల్లప్పుడూ బాగా మరిగించి వినియోగించుకోవాలన్నారు. వ్యాధిగ్రస్థ పశువు మిగిల్చిన మేత, గర్భస్రావ మట్టు, మాయ, పిండాలను గొయ్యి తీసి పూడ్చిపెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహులు, డాక్టర్ రాజీవ్ కిషోర్ వి.ఏ.యస్ పాల్గొన్నారు

కృత్రిమ మేధో హక్కులపై సునిశిత సమీక్ష అవసరం

గీతం అంతర్జాతీయ సదస్సులో న్యాయ నిపుణులు


అతిథులను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : కృత్రిమమేధ (ఎఐ)వినియోగం అన్ని రంగాలలో పెరుగుతున్న నేపథ్యంలో మేధోహక్కుల విషయంలో సునిశిత సమీక్ష అవసరమని, నైతికపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం డీమ్డ్‌విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా, ఎక్విటస్ విక్టోరియా రీసెర్చి సెంటర్ (బీహార్) సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన అంతర్జాతీయ సదస్సును అసోం జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, జుడిషియల్ అకాడమీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెవిఎస్.శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన ఆవిష్కరణల మేధోహక్కులు ఎవరికి చెందుతాయనే అంశంపై సదస్సులో మాట్లాడుతూ గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ పరిశోధనలలో, సిద్ధాంత వ్యాసాలను సమర్పించడంలో కృత్రిమ మేధను ఒక మాధ్యమంగా వినియోగం పెరుగుతోందని, ఈ నేపథ్యంలో అసలైన మేధోహక్కులకు భంగం కలగకుండా ప్రత్యామ్నాయం చూడాలన్నారు. ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ శ్రీసుధ మాట్లాడుతూ వివిధ పరిశ్రమలలో, విద్యారంగంలో కృత్రిమ మేధ వాడకం వల్ల సరికొత్త వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. న్యాయవాద వృత్తిలో కత్రిమ మేధను సరైన విధంగా ఉపయోగించుకుని న్యాయ నిపుణులు లబ్ధిపొందవచ్చునని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ సి.హెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ కృత్రిమ మేధను ఉపయోగించేవారు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నూతన ఆవిష్కరణలు, సాంకేతిక ఉత్పత్తుల పరిశోధకులు పొందే మేధోహక్కులను చట్టపరంగా రక్షించే ఆలోచన అవసరం అన్నారు. జార్జియా దేశంలోని ఇవెన్ స్టేట్ యూనివర్సిటీ న్యాయ నిపుణుడు డాక్టర్ గార్గి అమిరన్ యురోపియన్ దేశాలలో కృతిమ మేధను కట్టడికి అనుసరిస్తున్న పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎక్విటస్ విక్టోరియా ఫౌండేషన్ డైరక్టర్ డాక్టర్ డి.రంగస్వామి, సదస్సు కన్వీనర్‌లు డాక్టర్ జి.గణేష్‌కుమార్, ఎల్.ఆశిష్‌కుమార్, చిత్రసక్సెనా పాల్గొన్నారు

పోలవరం ముంపు బాధితులకు పరిహారం చెల్లించాలి

మోటు తాలుకా కేంద్రంలో భారీ బహిరంగ సభ



బహిరంగ సభకు హాజరైన పోలవరం ముంపు బాధితులు

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న ఒడిశా రాష్ట్రంలోని బాధితులకు పరిహారం, ప్యాకేజీలు ఇవ్వాలని కోరుతూ ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా మోటు తాలూకా కేంద్రంలోని క్రీడా మైదానంలో శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆదివాసీలను నిండా ముంచే పోలవరం ప్రాజెక్టును నిర్మించవద్దని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోటు తాలూకాలో 12 ఆదివాసీ గ్రామ పంచాయతీలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఆదివాసీలు ప్రతి ఏటా ముంపునకు గురై ఆస్తులు కోల్పోతున్నారని, వారికి నేటికీ కేంద్ర ప్రభుత్వం ఎటువంటి భరోసా కల్పించకపోవడం దారుణమన్నారు. పరిహారం, ప్యాకేజీ అందించిన తర్వాతే ప్రాజెక్టు కట్టాలని ఉన్నత న్యాయస్థానాలు తీర్పు చెప్పినా ఇక్కడి పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా జెడ్‌పి మాజీ చైర్మన్ చందా లింగయ్య నేరుగా ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో లైవ్‌లో మాట్లాడారు. పోలవరం బాధిత గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై నవీన్ పట్నాయక్ సానుకూలంగా స్పందించి ఆదివాసీలకు జరిగే అన్యాయంపై శాసనసభలో కచ్చితంగా ప్రశ్నిస్తామని, కేంద్రానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు ప్రదీప్ మాంజి, మొన్న ఖాన్, ప్రతి, మాజీ మంత్రులు పద్మిని ధ్యాన్, రవి నారాయణ, మాజీ ఎమ్మెల్యే మనోజ్ మడకామి, ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్, కాంగ్రెస్ నేత ఈశ్వర పాణిగ్రహి, ఆప్ నాయకులు రమేష్ చంద్ర, పెద్దలు, గిరిజనులు పాల్గొన్నారు.

పలుచోట్ల జాతీయ సైన్స్ దినోత్సవం


సీలేరు డిఎవి పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఫిజిక్స్ విభాగం అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ సివి రామన్ యావత్ భారత దేశం గర్వపడే విధంగా రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతాన్ని ఆవిష్కరించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు యం.నాగ మోహన్ రావు, జి.వెంకటరావు, డాక్టర్ వై పద్మ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

చింతూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్ సివి రామన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఏవి పాఠశాలలో భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులచే సైన్స్ విభాగంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. సైన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాండురంగ స్వామి సైన్స్ ప్రయోగం చేసి విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమేష్ బాబు, ఉపాధ్యాయులు బొడారపు కృష్ణ, సతీష్, సత్యనారాయణ, విజయబాబు పాల్గొన్నారు.

పలు ప్రధాన రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయవాడ డివిజన్‌లో కడియం - ద్వారపూడి - అనపర్తి మధ్య ఆటోమేటిక్ సెక్షన్‌ను ప్రారంభించడం కోసం నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. ఈ క్రమంలో 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మార్చి1, 2 తేదీలలో, 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మార్చి 2, 3 తేదీలలో, 22701 విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ మార్చి 2న, 12805 విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మార్చి 2న, 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మార్చి 3న రద్దయ్యాయి.

నేరాలు ఘోరాలు

250 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడిన నిందితుడితో పోలీసులు

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలో కేంద్రంలో ఉరుము జంక్షన్ వద్ద స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 250 కిలోలు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం ఉరుము జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహిస్తుండగా ఆటోను తనిఖీ చేయగా 8 గోనె సంచుల్లో 250 కిలోల గంజాయి గుర్తించామన్నారు నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

18 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాకలో ఒక వ్యక్తి దగ్గర అక్రమంగా నిల్వ ఉన్న 18కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, కేరళ రాష్ట్రానికి చెందిన షహీమ్ అనే యువకుని వద్ద గంజాయి పట్టుబడింది. గంజాయితోపాటు నిందితుని సెల్‌ఫోనుస్వాధీనం చేసుకున్న పోలీసులు, అతడిని అదుపులోకి తీసుకున్నారు.

గంజాయి కేసులో నిందితునికి నాలుగేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ రిపోర్టర్ : గంజాయి రవాణా కేసులో నిందితునిపై నేరాభియోగం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు, రూ.20వేలు జరిమానా విధిస్తూ మత్తుమందుల కేసులు విచారణ ప్రత్యేక న్యాయస్థానం, ఒకటవ అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఎం వెంకటరమణ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన గ్రేడ్ వన్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జిఎస్ఎన్‌వి ప్రసాదరావు. కోర్టు లైజెనింగ్ కానిస్టేబుల్ సిహెచ్ వీరేంద్ర అందించిన వివరాలివి.

నమ్మకమైన సమాచారంతో విశాఖపట్నంలోని కొబ్బరి తోట ప్రాంతంలో అప్పటి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ వై గోవిందరావు, పోలీసులతో నిర్వహించిన నాకాబందీలో అదే ప్రాంతానికి చెందిన బోలెం, వెంకన్న బాబు, ఒక్కొక్కటి 13 కేజీలు చొప్పున రెండు సంచుల్లో గంజాయితో పట్టుబడ్డారు. దీనిపై దర్యాప్తు చేసిన సిఐ టి.కల్యాణి అరెస్టు చేసి కోర్టు ప్రవేశపెట్టారు. దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. విచారించి న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువైనందున శిక్షవిధిస్తూ తీర్పు వెల్లడించారు.

డ్రగ్స్ జోలికి పోవద్దు : సిఐ


మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి -అనంతగిరి: చదువుకునే దశలో యువత మత్తు పానీయాలు, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని అరకు సీఐ ఎల్ .హిమగిరి సూచించారు. శుక్రవారం శివలింగపురం బాలుర పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యుక్త వయసులో మాదకద్రవ్యాలు వంటి మత్తు పానీయం, .గంజాయి, డ్రగ్స్ వాడి బంగారు భవిష్యత్తుఉన పాడు చేసుకోవద్దన్నారు. ఉన్నతమైన చదువులు చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ స్థానిక ఎస్సై డి. శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ వైకుంఠం పాల్గొన్నారు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బస్ షెల్టర్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండల కేంద్రంలోని అల్లూరి జంక్షన్ బస్టాండ్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తాహశీల్దార్ అల్లు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్నాథం, సూరిబాబు మాట్లాడుతూ రాజవొమ్మంగి నుండి నర్సీపట్నం, ఏలేశ్వరం, రంపచోడవరం వంటి ప్రాంతాలకు నిరంతరం ఇదే రహదారి మీదుగా వందలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ప్రయాణికులకు నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా బస్సు షెల్టర్ తొలగించారని, దీంతో ప్రయాణికులు ఇక్కట్లు గురవుతున్నారని పేర్కొన్నారు. టాయిలెట్స్ సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టాయిలెట్స్ దాదాపు 40 నుండి 70 కిలోమీటర్ల లోపు ఎక్కడా లేవన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తక్షణం ప్రయాణికులకు అనుకూలమైన బస్సు షెల్టర్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, వేసవి నేపథ్యంలో ప్రయాణికులు దాహార్తిని తీర్చేందుకు వీలుగా తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన తహశీల్దార్ అల్లు సత్యనారాయణ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జూనియర్ కళాశాలలో మార్చి 1 నుండి 15వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపియింగ్ జరగకుండా పగడ్బందీ చర్యలు చేపట్టామని ప్రిన్సిపాల్ వి.శంకర్రావు వెల్లడించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల సీఈసీ హెచ్ఇసి గ్రూపులకు సంబంధించి 95 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి నిర్ణీత సమయానికి 30 నిమిషాల ముందే హాజరుకావాలని, లేకుంటే పరీక్ష కేంద్రానికి అనుమతించమని చెప్పారు. పరీక్షలు ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఇతరులు సంచరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హుకుంపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటా పోలీస్ పందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఒకేషనల్ జూనియర్ కళాశాల, కేజీబీవీ, జనరల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 375 మంది పరీక్ష రాయనున్నట్లు ఆయన తెలిపారు.

జాప్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా లక్ష్మణ్

ప్రజాశక్తి -సీలేరు : జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జెఎపి) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జికె.వీధి మండలం రిపోర్టర్ (ఆంధ్రప్రభ) సాగిన లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తనను రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నుకున్నందుకు జాప్ వ్యవస్థాపకులు ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అల్లూరి జిల్లాలో యూనియన్ బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. తన పరిధిలో ఉన్న సమస్యలు జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీకి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని లక్ష్మణ్ తెలిపారు.